andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 4 మే 2024





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి శరత్

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు భేష్

- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన ప్రత్యేక అధికారి శరత్

నిజామాబాద్ అర్బన్, మే 3: నీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చేపడుతున్న ముందస్తు చర్యలు భేషుగ్గా ఉన్నాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి శరత్ అభినందించారు. ప్రస్తుతం మేలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పనిచేయాలని నీటి సరఫరా వ్యవస్థను ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి జిల్లాలో మంచినీటి సరఫరా పరిస్థితిపై మండల స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నారని వేసవి సీజన్ ముగిసే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంటే ముందే గమనించి ముందస్తుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. నీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉన్న పలు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన అన్నారు. ఈ సమీక్షలో నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

హీటెక్కిన ప్రచారం



- ఎన్నికల పోలింగ్‌కు దగ్గర పడుతున్న సమయం
- ఎండలను లెక్కచేయకుండా అభ్యర్థుల ప్రచారం
- సమావేశాలు, రోడ్‌షోల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్న నేతలు

నిజామాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం హీటెక్కుతుంది. ఎండలను సైతం లెక్క చేయకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో పూర్తిస్థాయిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జిలతో పాటు సీనియర్ నేతలతో కలిసి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ఓ వైపు ఇన్‌చార్జిలు మరో వైపు ప్రచారాన్ని చేస్తూనే ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన రీతిలోనే ప్రచార వేడిని కూడా పెంచారు. మూడు పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తూనే ప్రచారంలో ముందుకు పోతున్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

అభ్యర్థుల సుడిగాలి పర్యటనలు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారం హీటెక్కింది. ఎండలు పెరిగిన రీతిలోనే ప్రచారం కూడా పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌లు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎర్రటి ఎండలు హీటెక్కిస్తున్న ప్రచారం తగ్గించడం లేదు. ఉదయం 6గంటల నుంచే ప్రచారం మొదలు పెట్టి రాత్రి 10 గంటల వరకు కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ కూలీలు, గల్ఫ్ కార్మికుల కుటుంబాలు, రైతులు, ఇతర వర్గాలతో సమావేశాలు, ఆత్మీయ సమ్మేళాలను నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే తాము గెలవగానే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ప్రకటిస్తున్నారు. మూడు పార్టీల నేతలు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను రంగంలోకి దించి డోర్ టూ డోర్ కాంపేయిన్‌లు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో అన్ని వర్గాల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూనే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎండలు మండిస్తున్న వయస్సును లెక్కచేయకుండా అభ్యర్థులు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో పార్లమెంట్ పరిధిలో కలియతిరుగుతూ అన్ని వర్గాల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎనిమిది రోజులే

ఈ ఎన్నికల ప్రచారానికి ఇంకా ఎనిమిది రోజులే గడువు ఉండటంతో ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని భారీ సభలను నిర్వహించేందు కు సిద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో ఓటర్ల మద్దతును కూడగట్టడంతో పాటు పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్ రోజు కేంద్రాలకు ఓటర్లు వచ్చే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎంత ప్రచారం నిర్వహించి ఎన్ని హామీలు ఇచ్చిన ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల పోలింగ్ రోజు ఓటర్లు తక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగానే మూడు పార్టీల నేతలు పోలింగ్ బూత్ కమిటీలపై నజర్ పెట్టారు. భారీ బహిరంగ సభలు నిర్వహించడంతో పాటు పోలింగ్ బూత్‌ల వారీగా నిత్యం సమీక్షిస్తున్నారు. ఇన్‌చార్జిలు, పని చేసే పార్టీ క్యాడర్‌కు అవసరమైన ఖర్చును భరిస్తూనే ఓటర్ల వారిగా కలిసే విధంగా చూస్తున్నారు. ప్రతి పార్లమెంట్ ఎన్నికల్లో శాసనసభ ఎన్నికల్లాగా ఓటర్లు పోలింగ్‌కు రాకపోవడం వల్ల తక్కువ శాతం నమోదు అవుతుంది. ఈ ఎన్నికల్లో కూడా ఎండల ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల తక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని భావించిన ఎన్నికల కమిషన్ సమయాన్ని సాయంత్రం 6గంటల వరకు పెంచింది. ఈ సమయాన్ని కూడా వినియోగించుకునే విధంగా బూత్ కమిటీలకు అవగాహన కల్పిస్తున్నారు. వారి ద్వారా డోర్ టూ డోర్ కాంపియన్ లు చేస్తున్నారు.

రేపు అమిత్‌షా రాక

ఈ నెల 5న బీజేపీ ప్రచారానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నగరానికి రానుండటంతో ఆ పార్టీ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. బీఆర్ఎస్ తరఫున పార్లమెంట్ పరిధిలో ఈనెల 5న జగిత్యాల, 6న నిజామాబాద్‌కు కేసీఆర్ రానుండటంతో భారీ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. కాంగ్రెస్ నేతలు కూడా మరో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్మూర్‌లో నిర్వహించి నేతలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్న సమయంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు పూర్తిస్థాయిలో ప్రచారాన్ని నిర్వహించడంతో పాటు తమ పార్టీల ద్వారా ప్రజలకు చేసిన సేవలను వివరిస్తూ మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ప్రభుత్వాల హయాంలో ఏయే పనులు ప్రజలకు చేశారో వివరిస్తున్నారు. మొత్తంగా ఈ ఎండలు అభ్యర్థులతో పాటు పార్టీ నేతలకు ఇబ్బందులను గురి చేస్తున్న ప్రచారాన్ని మాత్రం ఆపడం లేదు. గెలుపే ధ్యేయంగా మూడు పార్టీల అభ్యర్థులు ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు



పకడ్బందీగా హోమ్ ఓటింగ్

- పర్యవేక్షించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు





ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఆర్మూర్‌కు చెందిన 93 ఏళ్ల వృద్ధుడు దొండి జగ్గే శివదాస్

నిజామాబాద్ అర్బన్, మే 3: ఇంటి నుంచి ఓటు సేకరించే (ఓట్ ఫ్రమ్ హోమ్) ప్రక్రియను పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కాగా ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతుందని మొదటి రోజున పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల బృందాలు ఆయా రూట్‌ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇండ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించారని తెలిపారు. హోమ్ ఓటింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికార బృందాల పనితీరును నిశితంగా పరిశీలించడం జరిగిందన్నారు. వీడియో చిత్రీకరణతో పాటు సూక్ష్మపరిశీలకులు ఈ ప్రక్రియను పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 1758 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని వినియోగించుకోనుండగా వీరిలో 85 సంవత్సరాల పై బడిన వారు 859 మంది, దివ్యాంగులు 899 మంది ఉన్నారని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి పొరపాట్లకు, తప్పిదాల కు అవకాశం లేకుండా మొత్తం 50 బృందాలు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నాయని కలెక్టర్ తెలిపారు.

జాగ్రత్తగా ఓటింగ్ నిర్వహించాలి..

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులకు సూచించారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నిజామాబాద్ రూరల్ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి నిజామాబాద్ ఆర్‌డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ సేకరణ కోసం ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించి రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఓటింగ్ సర్వేను అడిగి తెలుసుకున్నారు.

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్

పార్లమెంట్ సాధారణ ఎన్నికల సందర్భంగా లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం పూర్తి చేశారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలీస్ వజ్ హర్ సమక్షంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎదుట ఈవీఎంల రెండవ ర్యాండమైజేషన్ జరిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1808 పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్‌ను పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అదనంగా 25 శాతం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు రిజర్వులో ఉంచడం కోసం కేటాయిస్తున్నామని 40 శాతం వీవీ ప్యాట్‌లను రిజర్వులో ఉంచేలా అదనంగా కేటాయిస్తున్నామన్నారు. ఎన్నికల్లో 29 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు చొప్పున బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉన్నందున ఈ మేరకు రిజర్వు యూనిట్లను కలుపుకొని మొత్తంగా 4514 బ్యాలెట్ యూనిట్లు, 2257 కంట్రోల్ యూనిట్‌లు, 2527 వీవీప్యాట్ యంత్రాలను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ ర్యాండమైజేషన్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సాకేత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ వస్తేనే ‘ఉపాధి’కి గ్యారంటీ

- బీజేపీ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తోంది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి

నిజామాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వస్తేనే ఉపాధి హామీకి గ్యారంటీ ఉంటుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట చేపూర్, పిప్రి గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. యూపీఏ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం తీసుకువచ్చామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రధాని మోదీ వల్ల ఉపాధి పథకానికి ఏటా నిధులను తగ్గిస్తున్నారని అన్నారు. పేదలకు, కూలీలకు అండగా ఉండే కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనను ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం వేతనం రూ. రూ.400, వేసవి అలవెన్స్‌ను 30శాతం ఇస్తామన్నారు. ఉపాధి హామీ పథకం కోసం ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను కూడా భర్తీ చేసే విధంగా చూస్తామన్నారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే ఖరీఫ్ నాటికి రైతులకు 2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఆర్మూర్ ఇంచార్జి వినయ్‌కుమార్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ విధానం..

ఆర్మూర్ రూరల్: బీజేపీకి ఎలాంటి ఆర్థిక విధానం లేదని సమాజంలో మాతవిద్వేషాలు రెచ్చగొట్టడమే వారి విధానమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని క్షత్రీయ కల్యాణ మండపంలో పద్మశాలి కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సమాజాన్ని చీల్చడం, రాజకీయ లబ్ధిపొందడం బీజేపీ ఆలోచన విధానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పద్మశాలి సంఘ సభ్యులు

ఆర్మూర్‌కు చెందిన పద్మశాలి సంఘం ఎనిమిది తర్పల అధ్యక్షుడు అంబల్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుద్దేటి రమేష్, డిష్ రాము, ఆర్మూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దాసరి అనిల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, నియోజకవర్గఇన్‌చార్జి వినయ్‌రెడి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చెరకు ఫ్యాక్టరీలను తెరిచే యత్నం ఎన్నికల స్టంటే

- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ప్రకటనలు
- బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

నిజామాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో చెరకు ఫ్యాక్టరీలు తెరిచే యత్నం కాంగ్రెస్ ఎన్నికల స్టంటేనని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చెరకు ఫ్యాక్టరీలను తెరిచేందుకు 800 కోట్లు అవసరం కాగా.. కేవలం5 శాతం నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఓ కమిటీ వేశారన్నారు. ఈ ఫ్యాక్టరీలను డిసెంబర్ 2025లో తెరిచే అవకాశం ఉందని ఒక నివేదికను ఇచ్చారని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మాటమార్చి వచ్చే సెప్టెంబరు 17లోపు ఫ్యాక్టరీలను తెరుస్తామని ప్రకటన చేశారని అర్వింద్ విమర్శించారు.

ముఖ్యమంత్రి.. రియల్ ఎస్టేట్ రంగంలో ఫేమస్..

ముఖ్యమంత్రి.. రియల్ ఎస్టేట్ రంగంలో ఫేమస్ అని అర్వింద్ అన్నారు. ఫ్యాక్టరీల భూములను అమ్మేందుకు, కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశంలో బీజేపీ ఉన్నంతవరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ రిజర్వేషన్లకు వచ్చిన ఢోకా లేదన్నారు. రోహింగ్యాలకు పాస్‌పోర్టు వచ్చిన వ్యవహారంలో జగిత్యాలకు కూడా లింక్ ఉందని ఆయన విమర్శించారు. విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, స్రవంతిరెడ్డితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి..

ఇందల్వాయి: నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గన్నారం గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.



నగరంలో విలేకరులతో మాట్లాడుతున్న అర్వింద్

ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదు..

డిచ్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓట్లు అడిగే అర్హత ఆ పార్టీ నాయకులకు లేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

ప్రజలు మోదీ వైపు చూస్తున్నారు..

బోధన్‌రూరల్: ప్రజలు నరేంద్ర మోదీ వైపు చూస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి ప్రధానిగా మోదీ కాబోతున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి దర్పపురి అరవింద్ అన్నారు. శుక్రవారం బోధన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరడంతో వారికి ఎంపీ అర్వింద్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది : బాజిరెడ్డి



నిజామాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఇందల్వాయి, మే 3: సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. నగరంతో పాటు ఇందల్వాయి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు ఏ ఒక్క స్కీమ్ కూడా అమలు చేసే సత్తా లేదన్నారు. ఝూటా మాటలు చెబుతూ పబ్బం గడుపుతున్నారని ఆయన విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం ఇప్పటి వరకు చేయలేదన్నారు. ఐదునెలల క్రితం ఎన్నికల్లో పెట్టిన ఆరు గ్యారంటీలు ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎంపీ అర్వింద్ ఐదేళ్లలో ఏ ఒక్క పని చేయలేదని ఆయన ఆరోపించారు. పసుపు బోర్డు, గల్ఫ్ పాలసీ వంటివి తీసుకురాలేదన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీని తీసుకువస్తానన్నారు. పసుపు బోర్డును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు తమకు దగ్గరగా ఉండి అన్ని రకాల పనులను చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది తానేనని అన్నారు. ఈ ప్రచారంలో ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్త, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎంపీపీ రమేష్‌నాయక్, జడ్పీటీసీ సుమనరెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



ఇందల్వాయి ప్రచారంలో బాజిరెడ్డి గోవర్ధన్


పెద్దమల్లారెడ్డిలో వరిధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

'తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు పంపించాలి'

భిక్కనూరు, మే 3: వరి కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను వారు పరిశీంచారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ, తూకం, ఇతరితర వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు డబ్బులు సకాలంలో అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, కిష్టయ్య, రమేష్, ఆయావిండోల సీఈవోలు మోహన్‌గౌడ్, నర్సింలు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

ముప్కాల్, మే3: బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన రొండ్ల అనిల్(27) అనారోగ్యంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్‌కు గత కొన్ని రోజులుగా కిడ్నీలో రాళ్ల సమస్యతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. అయిన గత కొన్ని రోజులుగా మళ్లీ రావడంతో తాగుడుకు బానిసై గత నెల 26న తన వ్యవసాయ తోటలో గడ్డి మందును తాగాడు. కాగా, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై గోపి తెలిపారు. ఎనిమిది నెలల క్రితం మృతుని భార్య మానస అలియస్ మౌనిక గోడవ పడి పుట్టిం టికి వెళ్లింది. మృతుడి తండ్రి రొండ్ల లింగన్న ఇచ్చిన పిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'బీజేపీ ప్రజావ్యతిరేక పార్టీ'

మోపాల్, మే 3: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను పాల్పడుతుందని ఈ ఎన్నికల్లో ఓట్లు వేయవద్దని సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకుడు సాయాగౌడ్ ప్రజలను కోరారు. శుక్రవారం మేడే ఉత్సవాల్లో భాగంగా సిర్పూర్ గ్రామంలో మేడే జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఏర్గట్ల, మే 3: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాళ్లరాంపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దిబ్బ సుదర్శన్‌తో పాటు గుమ్మడి దేవేందర్, శ్రీను, ఆనంద్‌లతో పాటు పలువురు పార్టీలో చేరారు. ఇందులో పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు గంగాప్రసాద్, తదితరులున్నారు.

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ హక్కును వినియోగించుకోవాలి : అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

మద్నూర్, మే 3: శనివారం, ఆదివారం రెండు రోజుల్లో 85 సంవత్సరాలు పై బడినవారు, పూర్తిగా అంగవైకల్యం కలిగిన వారు ఇంటి వద్ద నుంచే ఓటువేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ ఎన్నికలరిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మద్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 85 సంవత్సరాలు పై బడిన వారికి, పూర్తిగా అంగవైకల్యం ఉన్న వారికి ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కల్పించిందని, ఫారం 12 డి ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు విధులు నిర్వహిస్తున్న ఆయా శాఖల ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవడానికి జహీరాబాద్ పార్లమెంట్, ఇతర పార్లమెంట్ పరిధిలో ఓటు హక్కు ఉండి జుక్కల్‌నియోజకవర్గం పరిధిలో ఉద్యోగం చేస్తూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్నవారి కోసం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లుతెలిపారు. ఈ నెల 4వ తేది నుంచి 8వతేది వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జుక్కల్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎవరెస్ట్‌పై త్రివర్ణ పతకాన్ని ఎగురవేస్తున్న లోక రాములు

ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన నూత్‌పల్లివాసి రాములు

డొంకేశ్వర్, మే3: మండలంలోని నూత్‌పల్లి గ్రామానికి చెందిన లోక రాములు ఎవరెస్ట్ మంచు పర్వతాన్ని అధిరోహించారు. వివిద రాష్ట్రాలకు చెందిన 16మంది సభ్యులతో కలిసి తెలంగాణ నుంచి ఆరుగురు సభ్యులు ఈ మంచు పర్వతాన్ని అధిరోహించడానికి 22న బయలుదేరి వెళ్లారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన లోక రాములు ఒక్కడే ఉండడం గమనార్హం. మాలవత్ పూర్ణ ఆధ్వర్యంలో ట్రాక్ అనే కంపెనీ ద్వారా 16మంది సభ్యులు 12రోజుల పాటు రోజుకి ఆరు నుంచి ఎనిమిది గంటల ట్రాకింగ్ చేసి పర్వత రోహాన్ని అదిరోహించి త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. తాము అదిరోహించిన మంచు పర్వతం సుమారు 5364మీటర్ల ఎత్తులో ఉంటుందని వివరించారు. నూత్‌పల్లి నుంచి పర్వతరోహణ చేపట్టిన రాములు రైతుగా వ్యవసాయం చేస్తూ తన సొంత ఖర్చులతోనే ఈ పర్వతరోహణం చేపట్టాడు. జీవితంలో ఎవరెస్టు శిభిరాన్ని ఒక్కసారైన అదిరోహించానికి ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.

ఆలూర్ విద్యార్థులను అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారి

ఆర్మూర్‌రూరల్, మే3: ఆలూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ అభినందించారు. ఇటీవల వెల్లడైన పదవ తరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారు. 10జీపీఏ సాధించిన విద్యార్థులు రక్షిత, సాయిమాధుర్య, సవిత, శరణ్య, భవజ్ఞ, దేవనంద్‌తో పాటు హెచ్‌ఎం నరేందర్‌ను డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు.

బందళ్ల రోడ్డును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

రెంజల్, మే 3: మండల కేంద్రంలోని బందళ్ల రోడ్డు పనులను ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రూ.3కోట్ల 45లక్షలతో రోడ్డును ప్రారంభించారని, రైతుల ప్రయోజనం కోసం బందళ్ల రోడ్డు నిర్మాణ పనులను చేపట్టిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బందళ్ల రోడ్డు పనులను శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంట పొలాలకు వెళ్లే బందళ్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రూ.3కోట్ల 45లక్షలతో రోడ్డు పనులను వెంటనే ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇందులో మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు రాములు, సాయిబాబా గౌడ్, జావీదోద్దీన్, సాయిరెడ్డి, ధనుంజయ్, పోచయ్య, మోహన్, నర్సయ్య, ప్రభాకర్, తదితరులున్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరి కొయ్యలను కాల్చొద్దు

- సారం కోల్పోతున్న భూములు
- పంట దిగుబడి తగ్గుతోంది..
- పొలాన్ని కలియదున్నితేనే పంటలకు మేలంటున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

డొంకేశ్వర్, మే3: గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల వరకూ కోసేవారు. రైతులకు పశువులు ఎక్కువగా ఉండడంతో గడ్డిని కుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వేస్టర్ మిషన్‌తో వరిపంటను కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు గడ్డిని తీసుకువెళ్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యాలను తగులబెడుతున్నారు. దీని వల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశాముందని ఎట్టి పరిస్థితిలోనూ వరి కొయ్యాలను తగులబెట్టొద్దని రైతులకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



డొంకేశ్వర్‌లో పంట పొలాల్లో వరి కొయ్యలను తగులబెడుతున్న దృశ్యం (ఫైల్)

● సారం కోల్పోతున్న భూములు

వరి కొయ్యలను కాల్చితే నష్టామే తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. కాల్చడం ద్వారా వీపరితమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతోంది. వరి నాటిన తర్వాత కొనలు తెల్లవారటం జరుగుతుంటుంది. ముఖ్యంగా పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతుమిత్ర పురుగులు నశిస్తాయి. దీంతో పంట దిగుబడి సరిగా రాదు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవకాశాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాల గట్టు మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యవరణానికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.

● పొలాన్ని కలియదున్నితేనే లాభాలు

కొయ్యలను నేలలో కలియదున్నడంతో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి దిగుబడులు అధికంగా వచ్చే అవకాశముంది. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్‌పాస్పెట్ చల్లితే వరికొయ్యలు మురిగి కొద్దిరోజుల్లో పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. మందుల వాడకం సగం వరకు తగ్గుతుంది. సూపర్‌పాస్పెట్ చల్లితే భూమిలో మందుల వాడకం తగ్గుతుంది. సేంద్రీయ పదార్థాలు స్థాయిని పెంచుతుంది. దీంతో నీటి నిలువ చేసుకుని సామర్థ్యమూ పెరిగితుంది. నేలలో కరుగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతుంది.

కొయ్యలను పొలంలోనే దున్నాలి..

● మౌనిక, వ్యవసాయ విస్తీర్ణాధికారి

వరి కొయ్యలను నిప్పులతో కాల్చడం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుంది. వరి కొయ్యలను పొలంలోనే దున్ని నీరు పెట్టి సింగిల్ సూపర్ పాస్పెట్ చల్లితే కుళ్లిపోయి సేంద్రియ పదార్థాల శాతం పెరుగుతుంది. దీంతో ముఖ్యంగా పంటలకు ఉప యోగపడే సూక్ష్మజీవులు, పురుగులు నశిస్తాయి.



వర్నిలోని డిగ్రీ కళాశాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కామారెడ్డి డిగ్రీ కళాశాలలో..
టీయూ ఆడిట్ సెల్ అధికారుల తనిఖీలు

డిచ్‌పల్లి, మే3: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ కళాశాలలు కొనసాగుతున్న వర్ని మండల కేంద్రంలోని ఎమ్‌జేపీటీ, విజయ, బాన్సువాడలో గల ఎస్ఆర్ఎస్ఎన్‌కే, ఎస్ఎస్ఎల్, శంశాంక్, బిచ్కుందలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మద్నూర్‌లో గల జీడీసీ, రత్నా కళాశాల, జుక్కల్‌లో గల రేయిన్‌బో మరియు పిట్లం మండలకేంద్రంలో ఎస్‌వీ డిగ్రీ కళాశాలలను శుక్రవారం తెలంగాణ వర్సిటీ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. 2024-25 విద్యాసంవత్సరానికి అనుమతుల తనిఖీల్లో భాగంగా ఈతనిఖీలు చేపట్టిన్నట్లు ఘంట చంద్రశేఖర్ తెలిపారు. యూజీసీ, ఉన్నత విద్యమండలి నిబంధనల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నమని, ప్రతీ కళాశాలలో ఉన్న వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు. తనిఖీల కార్యక్రమంలో ఆడిట్‌సెల్ డైరెక్టర్‌తోపాటు జాయింట్ డైరెక్టర్ అతిఖ్ సుల్తాన గోరి, రాంబాబు, ఆరతి, లావణ్య, ఇంగ్లీశ్ విభాగాధిపతి రమణ చారి, కెమిస్ట్రీ విభాగాధిపతి నాగరాజు ఉన్నారు.

ఒకే గొడుగు కింద
బీఆర్ఎస్, బీజేపీ ఎన్నికల ప్రచారం

ఇందల్వాయి, మే 3: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో శుక్రవారం ముందుగా బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. అది ముగిసిన వెంటనే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలతో కనిపించిన సభా ప్రాంగణం సమావేశం ముగియగానే ఫ్లెక్సీలు, జెండాలను తీసివేసి బీఆర్ఎస్ జెండాలను మార్చిఅక్కడున్న ప్రజలతోనే బీఆర్ఎస్ ప్రచారం జరగడంతో అందరూ చర్చించుకున్నారు.

వీరన్నగుట్టలో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిలోని వస్తువులు

రెంజల్, మే 3: మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన గుంజి రజితకు చెందిన ఇల్లు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లోని 10వేల నగదుతోపాటు వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. ఇల్లు గృహం పూర్తి కాలిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల పోలీసు కవాతు

ఇందల్వాయి, మే3: పార్లమెంట్ ఎన్నికల బందోబస్తులో భాగంగా ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామానికి వచ్చిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఐపీఎస్ ఆదేశాలమేరకు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాఎగరవేసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సైలు మహేష్, మనోజ్ కుమార్, తిరుపతి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫక్రుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

అర్వింద్‌పై గల్ఫ్ కార్మికుల చార్జ్‌షీట్



మాట్లాడుతున్న టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్

డిచ్‌పల్లి, మే3: డిచ్‌పల్లిలో గల్ఫ్‌కార్మికులు శుక్రవారం బీజేపీ అభ్యర్థిపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. గల్ఫ్ కార్మికులను ఓట్లు అడిగే ముందు నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ సమాధానం చెప్పాలని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ నంద భీమ్‌రెడ్డి డిమాండ్‌చేశారు. గల్ఫ్ దేశాల్లో భారతీయ కార్మికులకు అండగా కంపెనీలు ఇస్తున్నా కనీస వేతనాలను కేంద్రంలోని బీజేపీ ప్ర భుత్వం 30శాతం నుంచి 50శాతం తగ్గిస్తూ 2020 సెప్టెంబర్‌లో రెండు సర్క్యులర్‌లను జారీచేసి కార్మికుల పొట్టకొట్టిందని అన్నారు. ప్రవాసీ భారతీయ బీమా యోజన 10లక్షల ప్రమాద బీమాలో సహజ మరణానికి చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. హైదరాబాద్‌లో, సౌదీ అరేబి యాలో, కువైట్ దేశాల దౌత్యకార్యాలయాలు ఏర్పాటుకోసం ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా చేసిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు చొరవచూపలేదని ప్రశ్నించారు. సమావేశంలో గల్ఫ్‌జేఏసీ చైర్మన్ గుగిళ్ల రవిగౌడ్, నాయకులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, స్వదేశ్‌భీమ్‌రెడ్డి, చిన్నరెడ్డి, సంతోశ్‌రెడ్డి, న వీన్‌గౌడ్, గల్ఫ్‌కార్మికులు పండరి, రవీందర్, మోహన్, యాదగిరి ఉన్నారు.



భక్తులకు హితబోధ చేస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్

శివనామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, మే 3: నిత్యం శివనామస్మరణతో సకల శుభాలు చేకూరుతాయని మల్లారం శ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భగవాన్ నామ స్మరణతోనే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో సప్తాహ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు నిత్యం శివనామస్మరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని అన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, సప్తాహ నిర్వాహకులు మొగులయ్య, లక్ష్మణ్, పీరాజీ, దిగంబర్, అశోక్, శివప్రసాద్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రెంజల్, మే 3: నేడు మండల ప్రజా పరిషత్ చైర్మన్ లోలపు రజిని కిషోర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు హజరు కావాలని ఆయన అన్నారు.



హెగ్డోలిలో ప్రారంభమైన శివనామ సప్తాహ

హెగ్డోలిలో అఖండశివనామ సప్తాహ

కోటగిరి, మే 3: పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో శుక్రవారం అఖండ శివనామ సప్తాహ ప్రారంభమైంది. సప్తాహను సుంకిని మహరాజ్ సిద్ది లింగాప్ప స్వామి ప్రారంభించారు. వారం రోజులపాటు సప్తాహ కొనసాగనుంది. సప్తాహతో గ్రామాలలో భక్తిభావన పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ఎడపల్లి, మే3: మండల కేంద్రానికి చెందిన బండి శ్రీనివాస్ గౌడ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని భార్య ఉమకు రూ.లక్ష జీవిత బీమా చెక్కును శుక్రవారం భీమా డెవలప్‌మెంట్ అధికారి సుభాష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కేసని ప్రభాకర్ గౌడ్, నాగాగౌడ్, నర్సాగౌడ్, రేణుకాదాస్ గౌడ్, బాలరాజు గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మల్లాగౌడ్, కళ్యాణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉందాం

● కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

సిరికొండ,మే3: విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పలు సూచనలు పాటించాలని సిరికొండ ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. సిరికొండ మండల కేంద్రంలో శుక్రవారం భద్రత సూచలను తెలిపే కరపత్రాలను చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వర్షాకాలంలో ఈదురు గాలుల వల్లనో, ప్రకృతి వైపరీత్యాల వల్ల తీగలు తెగిపోవడం,సాగడం, స్తంబాలు విరుగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఎర్తింగ్ విఫలమవ్వడం, అజాగ్రత్తగా వ్యవహరించే వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలకు గురవుతుంటారని అన్నారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులందరూ భద్రత సూచలను పాటించాలని కోరారు రైతులు తమ అవసరాల నిమిత్తం వ్యవసాయ పంపుసెట్లను వినియోగించెటప్పుడు, ఏమరుపాటుతో పైపులను, స్టార్టర్ డబ్బాలను ముట్టుకోవద్దని ఆయన సూచించారు. వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టార్టర్లను, మోటార్లను తాకవద్దన్నారు. డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజ్‌లు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమని ఏఈ వివరించారు. సర్వీస్ వైర్లను, వీధిదీపాలని సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దని, సంస్థ సిబ్బంది సమయం కోరడం తప్పనిసరిని చెప్పారు. వినియోగదారులు బద్రత చర్యలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

గడ్డిని కాల్చేందుకు వెళ్లి..
అదే మంటల్లో పడి రైతు మృతి

సిరికొండ, మే3: పొలం కోయగా మిగిలిన గడ్డిని కాల్చేందుకు యత్నించి.. అవే మంటలు అంటుకొని ఓ రైతు మృతి చెందిన ఘటన సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన రైతు లాయిడి కిషన్(35)కు పోత్నూర్ గ్రామ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల తన పొలం కోయగా మిగిలిన గడ్డిని కాల్చేందుకు గురువారం పొలం వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ అవే మంటలు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కిషన్ గురువారం రాత్రి వరకు రాకపోవడంతో.. కుటుంబీకులకు అనుమానం వచ్చి శుక్రవారం పొలం వద్దకు వెళ్లారు. అక్కడ కిషన్ కాలిన శవం కనిపించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. కిషన్‌కు కాళ్ల నొప్పులు ఉండడంతో నడువలేని స్థితిలో మంటల్లో చిక్కుకుని చనిపోయి ఉంటాడని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. కిషన్ మరణించి తీరు గ్రామస్థులు కంటతడి పెట్టించింది. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బుద్దె రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బోధన్‌రూరల్, మే 3: బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త బుద్దె రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని శుక్రవారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. ఈ సందర్భంగా బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. బుద్దె రాజేశ్వర్ మృతి నియోజకవర్గానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇల్తెపు శంకర్, సాలూర షకీల్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జానకంపేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



ప్రయాణికులకు మంచినీటిని అందిస్తున్న దృశ్యం

ఎడపల్లి, మే3: మండలంలోని జానకంపేట గ్రామంలోని చౌరస్తాలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రతీరోజు రాకపోకలు జరిపే ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు జానకంపేట సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తాళ్ల విజయ్ కుమార్‌గౌడ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.

దేశం మరింత అభివృద్ధి చెందాలంటే
మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు యెండల లక్ష్మీనారాయణ

రుద్రూరు, మే3: దేశం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని బీజేపీ రాష్ట్రనాయకుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రుద్రూరులో శుక్రవారం పర్యటించి మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకున్న ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. వందరోజులు దాటినా ఆరు గ్యారంటీలను అమలు కాలేదని విమర్శించారు. ధర్మం, న్యాయం కోసం పోరాడే బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి అధ్యక్షురాలు అరుణతార, రుద్రూరు మండలఅధ్యక్షుడు హరికృష్ణ, నియోజకవర్గ కన్వీనర్లు, ప్రభారీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరి: కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రైతులకు బోనస్ ఇవ్వలేదని, మహిళలకు చేయూత పథకం కింద రూ2500 ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, దెగ్లూర్ ఎమ్మెల్యే సామ్నే, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

డిచ్‌పల్లిలో ఆర్‌యూబీ నిర్మాణానికి మోక్షమెప్పుడో?

● నెరవేరని మండల ప్రజల కల ● ప్రతీసారి ఎన్నికల ప్రచారానికి వాడుకుంటున్న పార్టీలు ● ప్రస్తుత ఎంపీ అర్వింద్, మాజీ ఎంపీ కవిత హామీ ఇచ్చినా అమలుకు నోచుకోని వైనం

డిచ్‌పల్లి, మే3: డిచ్‌పల్లిలోని ఆర్‌యూబి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఆర్‌యూబీ నిర్మిస్తామని అన్ని పార్టీలు ప్రచారానికి వాడుకుని ఎన్నికలు ముగియగానే విస్మరిస్తు న్నారు. దీంతో డిచ్‌పల్లిలో ఆర్‌యూబీ నిర్మాణ కలగానే మిగిలిపోతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రం నుంచి ఘన్‌పూర్, డిచ్‌పల్లి, ముల్లంగి వైపు వెళ్లాలంటే రైల్వే ఘన్‌పూర్ రైల్వేగేటు దాటి వెళ్లాల్సి పరిస్థితి. ఇక్కడ సగటున రైళ్ల ప్రతీ 15నిమిషాలకు ఒకసారి రాకపోకలు సాగిస్తుంటాయి. రైలు వచ్చిన ప్రతీసారి రైల్వే గేటు మూత పడుతుంది. దీంతో ఇక్కడ చుట్టూ పక్కల గ్రామాలు ప్రజలు ఆర్‌యూబీ నిర్మించాలని గత 10 ఏళ్లగా కోరుతున్నా పాలకులు మాత్రం కనీసం స్పందించడం లేదు. గతంలో ఎంపీలుగా పనిచేసిన మధుయాష్కీగౌడ్, కల్వకుంట్ల కవితలకు పలుసార్లు గ్రామాల ప్రజలు వినతులు అందజేసినా నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు. ఒక అడుగు ముందుకు వేసిన మాజీ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత రైల్వే ఆర్‌యూబీ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించి వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఈ విషయం రైల్వే ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం చొరవ చూపుతానని ప్రకటించినా ప్రతిఫలం కనబడలేదు. అనంతరం నిజామాబాద్ ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్‌కు అనేకమార్లు స్థానికులు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు లేక నిత్యం రైల్వే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని ప్రతీసారి ఎన్నికల్లో ప్రచారంలో ఆర్‌యూబీ వంతెన నిర్మిస్తామని అన్ని రాజకీయపార్టీలు ప్రచారానికి వాడుకుని అధికారంలోకి వచ్చాక అటువైపు కన్నెత్తి చూడటంలేదు. ఇది పార్లమెంట్ ఎన్నికల సమయం కావడంతో ఈ విషయంపై రాజకీయ పార్టీల నాయకులను నిలదీసేందుకు స్థానికులు, ప్రజలు సిద్ధమవుతున్నారు.



డిచ్‌పల్లి రైల్వేస్టేషన్



రైలు కింద నుంచి ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న స్థానికులు



ప్రతిపాదిత స్థలం



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

• బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, మేౕ3: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చేపార్లమెంట్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి నగరంలోని 36వ డివిజన్ హమల్‌వాడిలో నిర్వహించిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, కేంద్రంలోనూ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అవి నీతి చేసి ప్రజల సొమ్మును దోచుకుందని, జీవన్‌రెడ్డికి ప్రతిఒక్కరు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షు డు మానాల మోహన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, విక్కియాదవ్, తదితరులున్నారు.

ఆర్మూర్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

• ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్, మేౕ3: ఆర్మూర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చాయ్‌పే చర్చ కార్యక్రమంలో మండలంలోని అమ్రాద్, గొట్టుముక్కల గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సురేష్‌నాయక్, బీజేపీ నాయకులు గంగారెడ్డి, వినోద్‌కుమార్, కంచెట్టి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దు

• నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



న్యాల్‌కల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, మేౕ3: బీఆర్‌ఎస్, బీజేపీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రిమండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, మంచిప్ప, మోపాల్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఆయా పార్టీల నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని అన్నారు. పదేళ్ల కాలంలో బీజేపీ, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, గంగాప్రసాద్, తదితరులున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంజల్, మే 3: మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. మహారాష్ట్ర నుండి నిజామాబాద్ వైపు వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రత్యేక బలగాలతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన వెంట సిబ్బంది నారాయణ, శంకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

ఆర్మూర్‌రూరల్, మే 3: శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెళకువలతో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో రాణించాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. శుక్రవారం మగ్గిడి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నవ వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. శిక్షణ శిబిరానికి రూ.10వేల ప్రొత్సహకాన్ని అందజేశారు. ఈ సందర్బంగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవికాలంలో సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారవ్వడమే గాకుండా స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు మధు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు

• ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకున్న మండల వయోవృద్ధులు, దివ్యాంగులు • ఇంటింటికీ వెళ్లి ఓటు సేకరించిన ఎన్నికల అధికారులు



నవీపేటలో హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు



అభంగపట్నంలో హోం ఓటింగ్‌కు వచ్చిన అధికారులు

నవీపేట, మే 3: ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వయోవృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల అధికారులు తమ ఇంటి నుంచే ఓటుహక్కు కల్పించారు. జిల్లావ్యాప్తంగా పలు పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగుల నుంచి శుక్రవారం ఓట్లు సేకరించారు. ఇంటి వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇటీవల దరఖాస్తు చేసుకున్న పలువురు 85 సంవత్సరాలు దాటిన వ్యక్తులతోపాటు పలువురు దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుండే ఓటు హక్కును వినియోగించుకున్నారు. నవీపేట, అభంగపట్నంలతో పాటు పలు గ్రామాలలో ఈ హోం ఓటింగ్ నిర్వహించారు. మండలంలో 55 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. శనివారం కూడా హోం ఓటింగ్ కొనసాగుతుందని అధికారులు వివరించారు. ఓటింగ్‌ను ఎస్సై యాదగిరిగౌడ్, ఏఎస్సై గఫర్ పర్యవేక్షించారు.



కమ్మర్‌పల్లిలో ఓటును సేకరిస్తున్న అధికారులు

• కమ్మర్‌పల్లిలో ఓట్ ఫ్రమ్ హోమ్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలోని ఐదు గ్రామాల్లో ఎన్నికల అధికారులు ఇంటింటికీ వెళ్లి వయోవృద్ధులు, దివ్యాంగులకు ఓటు హక్కును కల్పించారు. కమ్మర్‌పల్లి, అమీర్‌నగర్ నాగాపూర్, చౌట్‌పల్లి, హసాకొత్తూర్ గ్రామాల్లో మొత్తం 8మంది ఇంటి నుంచే ఓటుహక్కును వినియోగించుకున్నారు. శనివారం ఉప్లూర్, ఆర్‌ఆర్‌నగర్, కోనాసముందర్, ఇనాయత్ నగర్, కోనాపూర్, మానాల గ్రామాలకు చెందిన మరో 15 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే వినియోగించుకోనున్నారు. హోమ్ ఓటింగ్ టీం సభ్యులు గోపాల్, సంజయ్, రామ్‌దాస్, శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శరత్ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో బంగారు గొలుసు అపహరణ

పెద్దబజార్, మేౕ3: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ మహిళ రోగి సహాయకురాలి బంగారు గొలుసు అపహరణకు గురైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రోగి వెంటఉన్న సహాయకురాలు 2తులాల గొలుసును తన పర్సులో పెట్టుకోగా.. దీన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు గొలుసును కొట్టేశారు. ఆసుపత్రి సిబ్బందికి ఫిర్యాదు చేయగా సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. బాధితురాలు 1వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆసుపత్రిలో నిరంతర నిఘా ఉన్నప్పటికీ దొంగతనాలు జరుగుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.

మామిడిపల్లిలో గుడిసె దగ్ధం

మాక్లూర్, మేౕ3: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం నివాసపు గుడిసె దగ్ధమైంది. గుడిసెలో ఉన్న వంట సామగ్రి, కూలర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిర్వీర్యానికి బీజేపీ కుట్ర

• రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

మోర్తాడ్, మేౕ3: కాంగ్రెస్ ప్రభుత్వం కూలీల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మోర్తాడ్ శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధిహామీ కూలీలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, కూలీల సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు ముత్యం అశోక్, జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపి, మహిపాల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

జక్రాన్‌పల్లి, మేౕ3: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాతంగా జరుపుకోవాలని శుక్రవారం మండలంలోని జక్రాన్‌పల్లి, అర్గుల్ గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. సెంట్రల్ రిజర్వు పోలీసు బలగాలతో ఈ రెండు గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలను సజావుగా జరిగే విధంగా ఓట ర్లలకు నమ్మకం కలిగే విధంగా పోలీసు కవాతు నిర్వహించినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎన్నికల కోడ్‌ను, నియమ నిబంధనలను అందరూ పాటించాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి ఎస్సైలు సీహెచ్.తిరుపతి, మహేష్, పోలీ సు బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



జలాల్‌పూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

అభివృద్ధి చూసి ఓటెయ్యాలి: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, మేౕ3: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాల అమలుకోసం పార్లమెంట్‌లో జిల్లాప్రజల తరపున ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో ఉండాలని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు, అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోందని, అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని, హామీలను నమ్మిమోసపోవద్దని కోరారు. ప్రజల మధ్య ఉండి ప్రజల పక్షాన నిలబడే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. అంతకు ముందు ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మడల అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, లింగాగౌడ్, దాసరి వెంకటేష్, గడ్పంద అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌డీఎఫ్ ప్రచారాన్ని అడ్డుకున్న వాకర్స్

• గ్రౌండ్‌లో రాజకీయం వద్దంటూ వాగ్వాదం



టీఎస్‌డీఎఫ్ ప్రచారాన్ని అడ్డుకుంటున్న వాకర్స్

పెద్దబజార్, మే 3: జాగో తెలంగాణ పేరుతో నిర్వహించిన ప్రచారాన్ని ప్రజలు అడ్డుకున్నారు. అబద్ధపు విద్వేశ విభజన రాజకీయాలను ఓడించండి అని రాసిన కరపత్రాలను పంచడాన్ని వ్యతిరేకించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేక పాటను వేయడంతో వాకర్స్ దాన్ని అడ్డుకున్నారు. అక్కునూరి మురళితో పాటు కమ్యూనిస్టు నాయకులు ప్రభాకర్, ఆకుల పాపయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా మోదీకి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే వారంతా మోదీకి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే గ్రౌండ్‌లో జైశ్రీరాం నినాదాలు వినిపించాయి. మొదట మోదీకి వ్యతిరేకంగా వేసిన పాటతో ప్రారంభమైన వివాదం వాగ్వీదానికి దారి తీసింది. వాకర్స్‌కు టీఎస్‌డీఎఫ్ ప్రతినిధులకు మధ్య మాటామాట పెరిగి ఒక దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కార్యక్రమం మొత్తం దాదాపుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగింది. ఆ కార్యక్రమానికి వచ్చిన కొందరు నాయకులు మోదీకి వ్యతిరేకంగా మాట్లాడుతుండగానే అక్కడున్న వాకర్స్ కొందరు జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. గ్రౌండ్‌లో రాజకీయాలు చేయవద్దని టీఎస్‌డీఎఫ్ ప్రతినిధులకు అక్కడున్నవారంతా చెప్పి వెళ్లిపోయారు.

పార్లమెంట్ ఎన్నికలకు
బీజేపీ, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం

• బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారాం యాదవ్

సుభాష్‌నగర్, మే 3: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యరహస్య ఒప్పందం నడుస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారాం యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీవన్‌రెడ్డి, అర్వింద్‌లది మామా అల్లుళ్ల బంధమని అన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల అనంతరం జగిత్యాలలో జరిగిన సమావేశంలో ఎంపీ కావడానికి జీవన్‌రెడ్డి మామ ఎంతో కష్టపడ్డారని ప్రకటించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ చీకటిబంధాన్ని ప్రజలు ఎండగట్టాలని కోరారు. ఇందూరు నుంచి ఇండియా వరకు కాంగ్రెస్, బీజేపీ రహస్యబంధాన్ని కలిగి ఉన్నాయని అన్నారు. ఓయూ విద్యార్థి నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంత్‌పై అక్రమంగా పెట్టిన కేసులను ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎనగందుల మురళి, శంకర్, మహిపాల్ యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్‌ను పరిశీలించిన ఎన్నికల అధికారి

ఆర్మూర్‌టౌన్, మేౕ3: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, టీఎన్‌జీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగాస్తులు, టీఎన్‌జీవో భవనంలో పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే వయోవృద్ధుల దివ్యాంగుల పోస్టల్‌ఓటింగ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో రవికుమార్, ఎఎస్సై చిన్నయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, ఎ.పద్మ, ఆర్ఐ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగించుకున్న పోలీస్ సిబ్బంది



భారీగా నగదు పట్టివేత

నిజామాబాద్ అర్బన్, మే 3: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పరిమితికి మించి తీసుకువెళ్తున్న నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులను పోలీసులు సీజ్ చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా రూ.18 లక్షల 9 వేల 89 నగదును నిజామాబాద్ నగర పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుకున్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పరిధిలో రూ.89వేల 635 విలువ గల 49,681 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1753 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 11 కేసులు నమోదు చేశారు.

నీట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

• ఈనెల 5న పది సెంటర్లలో పరీక్ష

నిజామాబాద్ అర్బన్, మే 3: మెడికల్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ నీట్ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ మెరిగ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10 పరీక్షాకేంద్రాలలో ఈనెల 5న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌ఆర్ డిస్కవరీ స్కూల్ మాధవనగర్, ఎస్‌ఎస్‌ఆర్ సీబీఎస్‌ఈ స్కూల్ జన్నేపల్లి, ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ ఖలీల్‌వాడి, నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ బోధన్‌రోడ్, ప్రెసిడెన్సి హైస్కూల్ మోపాల్, నిర్మల హృదయ స్కూల్ సుభాష్ నగర్, విజయ హైస్కూల్ ముబారక్‌నగర్, క్షత్రీయ ఇంజనీరింగ్ కాలేజ్ ఆర్మూర్, నవ్యభారతి గ్లోబల్ స్కూల్ దాస్‌నగర్, కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల మానిక్ బండార్‌లలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉదయం 11గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని మధ్యాహ్నం 1.30 తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమన్నారు. విద్యార్థులు చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, విలువైన ఆభరణాలు వేసుకొని పరీక్ష కోసం రావద్దని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థులు తమ వెంట పాస్‌పోర్టు సైజ్ ఫొటో, పోస్టుకార్డు సైజ్ ఫొటో ఏదైనా ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ తీసుకొని రావాలని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఏదైనా సందేహాలు ఉంటే 8978198421 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

• 45 డిగ్రీలకు చేరువగా పగటి ఉష్ణోగ్రతలు



నిజామాబాద్ అర్బన్, మేౕ3: జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవు తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఇళ్లల్లో ఉండటం కూడా కష్టంగా మారుతోంది. దీంతో ప్రజలు కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో శుక్ర వారం ముప్కాల్ మండలం వేంపల్లిలో 44.2, మోర్తాడ్ 43.7, నిజామాబాద్ నార్త్ 43.5, నిజామాబాద్ సౌత్‌లో 43.5, వర్ని మండలం జాకోరాలో 43.4, వేల్పూర్ 43.3, సాలూరాలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లింపునకు
వన్‌టైం చాన్స్ పొడిగింపు

డిచ్‌పల్లి, మేౕ3: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని 2015 నుంచి 2016 వరకు డిగ్రీ అనుత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వన్ టైం చాన్స్ కోసం ఫీజు చెల్లింపు తేదీని పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొ. అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూన్, జూలై మాసంలో జరుగుతాయని పరీక్ష ఫీజు తేదీ అపరాధ రుసుము లేకుండా మే2 వరకు రూ.100 అపరాధ రుసుముతో మే3 వరకు పొడిగించారని గతంలో పేర్కొన్న తేదీని మే9 వరకు అపరాధ రుసుము లేకుండా రూ.100 అపరాధ రుసుముతో మే10 వరకు చెల్లించవచ్చునని కంట్రోలర్ పేర్కొన్నారు. అలాగే 2016 నుంచి 2019 వరకు చదివిన విద్యార్థులకు వన్‌టైం చాన్స్ తేదీని ఇచ్చినట్లు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, కోర్సులకు 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలకు వన్‌టైం చాన్స్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పరీక్షల ఫీజు వివరాలు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే2 వరకు చెల్లించవచ్చని, 3మే నుంచి 10మే వరకు రూ.100 అపరాధ రుసుముతో చెల్లించుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.275	రూ. 295



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,700	రూ.65,200	రూ.840

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (1.35, 7.45)
: టిల్లు స్క్వేర్ (4.30)
: బాక్ (10.40)

స్ర్కీన్-2 : ద పాల్ గాయ్ (ఇంగ్లీష్) (11.00, 1.50, 7.20, 10.10)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (4.40)

స్ర్కీన్-3 : ప్రసన్నవదనం (1.10, 4.15, 10.10)
: శబరి (7.20)

స్ర్కీన్-4 : బాక్ (1.10)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 7.35, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్ర్కీన్-2 : బాక్ (10.40)
: ప్రసన్నవదనం (1.40, 10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.45, 7.50)

స్ర్కీన్-3 : బాక్ (1.40, 4.35, 7.30, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : వకీల్ సాబ్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : బాక్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : ఆ ఒక్కటి అడక్కు (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్